క్లుప్తంగా

ఉప ముఖ్యమంత్రిని కలిసిన మాజీ ఎమ్మెల్యే



జనగామ: ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను మాజీ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ నాగపురి రాజలింగం, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు నాగపురి కిరణ్‌కుమార్‌గౌడ్ శనివారం హైదరాబాద్ ప్రజాభవన్‌లోని నివాస గృహంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. నూతన, సంక్రాంతి పండగ శుభాకాంక్షలు తెలిపి సత్కరించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో జనగామ నియోజక వర్గంలో కాంగ్రెస్ పార్టీ మంచి ఫలితాలు వచ్చే విధంగా కృషి చేయాలని ఉప ముఖ్యమంత్రి సూచించినట్లు తెలిపారన్నారు.

డిప్యూటీ సీఎంను, టీపీసీసీ అధ్యక్షుడిని కలిసిన ఝాన్సీరెడ్డి




పాలకుర్తి టౌన్: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌ను శనివారం వేర్వేరుగా కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనమాండ్ల ఝాన్సీరెడ్డి దంపతులు కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఝాన్సీరెడ్డి మాట్లాడుతూ పాలకుర్తి నియోజవర్గంలో 15 సంవత్సరాలుగా దీర్ఘకాలిక సమస్యలను వారి దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలిపారు. స్పందించిన వారు పాలకుర్తి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తామని, పార్టీ కోసం కష్టపడి పనిచేసే కార్యకర్తలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించినట్లు చెప్పారు.

రజక సంఘం పట్టణ కమిటీ ఎన్నిక



బచ్చన్నపేట: రజక సంఘం నూతన పట్టణ కమిటీని శనివారం మండల కేంద్రంలోని మడేలయ్య ఆలయ ప్రాంగణంలో ఎన్నుకున్నారు. పట్టణ అధ్యక్షుడిగా మిన్నాలపురం చెన్నయ్య, ఉపాధ్యక్షులుగా పెనిమెళ్లి సురేష్‌బాబు, దేవరకొండ మల్లేష్, మిన్నాలపురం సిద్దులు, దేవరకొండ లింగయ్య, ప్రధాన కార్యదర్శులుగా దేవరకొండ శ్రీనివాస్, పోచంపల్లి వెంకటేష్, కోశాధికారిగా మిన్నాలపురం రాజు, సలహాదారులుగా పోచంపల్లి రమేష్‌బాబు, శ్రీనివాస్, బలరాం, యూత్ ప్రెసిడెంట్‌గా పెనిమెళ్లి భరత్, గౌరవ అధ్యక్షుడిగా మిన్నాలపురం సిద్దులును ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ తమకు ఈ అవకాశం ఇచ్చిన వారందరికి కృతజ్ఞతలు తెలిపారు.

జవాన్‌కు ఘన స్వాగతం



బచ్చన్నపేట: మండలంలోని ఇటుకాలపల్లి గ్రామానికి చెందిన బొడిగం తిరుమల్‌రెడ్డి ఆర్మీలో జవాన్‌గా పనిచేసి స్వగ్రామానికి శనివారం రావడంతో.. గ్రామస్తులు ఆయనకు ఘన స్వాగతం పలికి సన్మానించారు. గ్రామానికి చెందిన బొడిగం పుష్ప, చంద్రారెడ్డి దంపతుల కుమారుడు తిరుమల్‌రెడ్డి ఆర్మీలో చేరి దేశం కోసం సరిహద్దుల్లో విధులు నిర్వర్తించాడు. పదవీవిరమణ అనంతరం ఆయన స్వగ్రామానికి చేరుకోగా గ్రామస్తులు ఘన స్వాగతం పలికి ర్యాలీగా తీసుకొచ్చారు. అనంతరం ఆయనకు పూల మాలలు వేసి శాలువాలతో సత్కరించారు పలు పార్టీల నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.


కెనాల్‌లో అడ్డుగా బండరాళ్లు

- వృథాగా పోతున్న గోదావరి జలాలు

రఘునాథపల్లి: అశ్వరావుపల్లి రిజర్వాయర్ కుడి కాల్వ గుండా గోదావరి జలాలు పారుతుండగా అడ్డుగా ఉన్న బండరాళ్ల కారణంగా పారకం కాల్వల వైపు నీరు వృథాగా పోతోంది. నాలుగు రోజుల క్రితం ఎమ్మెల్యే కడియం శ్రీహరి కుడి కాల్వకు సాగు నీరు విడుదల చేశారు. పంటల సాగు కోసం పలువురు రైతులు ఇబ్రహీంపూర్ శివారులోని కెనాల్‌లో మోటార్లు ఏర్పాటు చేసుకుని నీరు నిల్వ ఉండేలా పెద్ద పెద్ద బండరాళ్లు అడ్డుగా పెట్టారు. బండరాళ్లు అడ్డుగా ఉండటంతో జలాలు సాఫీగా వెళ్లక పారకం కాల్వల వైపు నీరు వృథాగా పోతున్నాయి. పెద్ద ఎత్తున వచ్చిన నీటితో వరి నాటు కొట్టుకు పోయిందని ఆ గ్రామానికి చెందిన మోర్తాల ప్రభాకర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇరిగేషన్ అధికారులకు సమస్య తెలిపినా పట్టించుకోవడం లేదని వాపోయారు. ఉన్నతాధికారులు స్పందించి కెనాల్‌లో అడ్డుగా ఉన్న బండరాళ్లను పూర్తిగా తొలగించాలని పలువురు రైతులు కోరుతున్నారు.



కెనాల్‌లో అడ్డుగా వేసిన బండరాళ్లు



వృథాగా పోతున్న గోదావరి జలాలు

అంకితభావంతో పనిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కొమ్మూరి

- డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి

జనగామ: రాబోయే స్థానిక సంస్థల ఎలక్షన్లలో కాంగ్రెస్ పార్టీ తరపున పోటీచేసే అభ్యర్థుల గెలుపునకు శ్రేణులు అంకితభావంతో పనిచేయాలని డీసీసీ అధ్యక్షుడు, నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం జిల్లా కేంద్రంలో జరిగిన నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశంలో టీపీసీసీ సభ్యులు చెంచారపు శ్రీనివాస్‌రెడ్డితో కలిసి కొమ్మూరి పాల్గొని మాట్లాడారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో తాను ఓటమి చెందినా, ప్రజల కోసం పనిచేస్తున్నానన్నారు. కొమ్మూరి నాయకత్వంలో స్థానిక సంస్థల్లో వంద శాతం విజయం సాధించేలా మనమంతా కష్టపడి పని చేయాలని చెంచారపు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సమావేశంలో నియోజకవర్గంలోని 8 మండలాల ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

బడుగుల ప్రభుత్వం కాంగ్రెస్

నర్మెట: బడుగుల బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తున్నదని, ఇందిరమ్మ కలలుగన్న పాలనను అందించడానికే సీఎం రేవంత్ రెడ్డి అహర్నిషలు కృషి చేస్తున్నారని డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంతోపాటు, వెల్దండ, గండిరామారం, మల్కపేటలకు చెందిన లబ్ధిదారులకు రూ. 3.32 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను తన కార్యాలయంలో శనివారం పంపిణీ చేసిన ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు గంగం నర్సింహారెడ్డి, మండల శాఖ అధ్యక్షుడు రాజబోయిన లక్ష్మీనారాయణ, నాయకులు గొల్లపల్లి కుమార స్వామి, ఫరీదుల యాదయ్య, గుర్రాల దయాకర్‌రెడ్డి తదితరుల పాల్గొన్నారు.

వినతి పత్రం అందజేత

తరిగొప్పుల: గ్రామానికి డెడ్ బాడీ ఫ్రీజర్ అందించాలని రెయిన్‌బో యూత్ అసోసియేషన్ సభ్యులు ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిని కోరారు. ఈ మేరకు శనివారం క్యాంపు కార్యాలయంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు అంకం రాజు మాట్లాడుతూ గ్రామంలో ఎవరు మృతి చెందినా దహనసంస్కారాలు చేయడంలో ఆలస్యమైతే మృతదేహాన్ని భద్రపరచడం కష్టంగా ఉందన్నారు. అక్తర్, జొన్నగోని రాజు, మంచినీళ్ల హరిప్రసాద్ తదితరులు ఉన్నారు.

జనగామ: ఏకశిల పబ్లిక్ స్కూల్‌లో ముగ్గుల పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు



జనగామ: సెయింట్ పాల్స్‌లో నృత్యం చేస్తున్న విద్యార్థులు



ముందస్తు సంక్రాంతి సంబురాలు

సాక్షి నెట్‌వర్క్: ముందస్తు సంక్రాంతి సంబురాలను పాఠశాలల్లో శనివారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు పతంగులు ఎగుర వేయగా, విద్యార్థినులు సంస్కృతి, సాంప్రదాయాలను చాటుతూ ముగ్గులు వేశారు. భోగి మంటలను వెలిగించి నృత్యాలు చేశాయి. అనంతరం ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



జనగామ రూరల్: సెయింట్ మేరీస్‌లో..



లింగాలఘణపురం: పీవీఆర్ పాఠశాలలో..



జనగామ రూరల్: అరబిందో పాఠశాలలో..

వైభవంగా అయోధ్య ఆలయ వార్షికోత్సవం

జనగామ: జిల్లా కేంద్రంలోని శ్రీరాంనగర్ కాలనీ హనుమత్ రామనాథ సహిత సీతారామచంద్రస్వామి దేవస్థానంలో శనివారం అయోధ్య రామ జన్మభూమి, భవ్య రామ మందిర బాలరాముని ప్రతిష్ఠ ద్వాదశి వేడుకలు ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. విశ్వహిందూ పరిషత్ జిల్లా ప్రధాన కార్యదర్శి, ఆలయ ప్రధాన అర్చకుడు మోహనకృష్ణ భార్గవ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలను చేపట్టారు. అంతకు ముందు ఆలయంలో స్వామి వారికి విశేష పూజలు చేశారు. ఈ సందర్భంగా మోహన కృష్ణ భార్గవ మాట్లాడుతూ ధర్మానికి నిలువెత్తు స్వరూపమైన రాముడు జన్మించిన అయోధ్యలో భవ్య రామ మందిర నిర్మాణం, బాలరాముడి ప్రతిష్ఠాపన వేడుకలను యావత్ దేశమంతా అంబరాన్నంటే సంబరాలను జరుపుకున్నారన్నారు. ప్రజలు ఏటా వార్షికోత్సవ వేడుకలను జరుపుకోవాలని పిలుపునిచ్చారు. కుల, వర్గ, వర్ణ, జాతి భేదం లేకుండా హిందువులందరూ ఒక్కటే అనే సామాజిక భావనను కలిగిస్తుందన్నారు. దేవాలయ కమిటీ సభ్యులు, భక్తులు ఎలసాని కృష్ణమూర్తి, కందాడి యాదగిరి, రాంబాబు, గాదర్ల రవి, చంద్రమౌళి, సిద్దిరెడ్డి, పోచన్న, రాజేశం, సాయి, సుజీత్ పాల్గొన్నారు.



పూజ చేస్తున్న భక్తులు

దేవరుప్పల బాలయేసు హైస్కూల్‌లో సంక్రాంతి సంబురాల్లో విద్యార్థులు





జనగామ రూరల్: సాన్ మారియా పాఠశాలలో..



చిల్పూరు: ఫతేపూర్ ప్రభుత్వ పాఠశాలలో..

సంక్షిప్త సమాచారం

రోడ్డు భద్రత నియమాలపై అవగాహన



తరిగొప్పుల: వాహనదారులు తప్పకుండా రోడ్డు భద్రత నియమాలు పాటించాలని ఎస్సై గుగులోత్ శ్రీదేవి సూచించారు. రోడ్డు భద్రత మాసోత్సవాలలో భాగంగా శనివారం మండలకేంద్రంలోని గాంధీ చౌక్ వద్ద ఆమె వాహనదారులకు రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కల్పించారు. హెల్మెట్ ధరించి ద్విచక్రవాహనాలు నడపాలని, మైనర్లకు బైక్ ఇవ్వద్దని సూచించారు. అన్ని వాహన సంబంధిత పత్రాలు సరిగ్గా ఉండాలని సూచించారు. పరిమితికి మించి ప్యాసింజర్లను ఎక్కించుకోవద్దని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది శ్రీనివాస్, కనుకరాజు, సురేష్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుల రాస్తారోకో

పాలకుర్తి టౌన్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తే అక్రమ అరెస్టుకు పాల్పడుతుందని బీఆర్ఎస్ జిల్లా నాయకులు పల్లా సురేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పసునూరి నవీన్ విమర్శించారు. శనివారం మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆదేశాల మేరకు శనివారం మండల కేంద్రంలోని రాజీవ్ చౌరస్తాలో బీఆర్ఎస్ నాయకులు నియోజవకర్గ స్థాయిలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా నవీన్ మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చినహామీలు అమలు చేయడం లేదన్నారు. సోషల్ మీడియా గిరిజన నాయకులు ప్రశ్నించినందుకు గిరిజన బిడ్డ రాజ్‌కుమార్‌ను అరెస్టు చేయడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. కొడకండ్ల, దేవరుప్పల, రాయపర్తి మండలలా అధ్యక్షులు సిందే రామోజీ,తీగల దయాకర్, నరసింహనాయక్, జీసీసీ మాజీ చైర్మన్ ధరవత్ మోహన్‌గాంధీ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ పట్టివేత

దేవరుప్పుల: మండలంలోని మున్‌పహాడ్ గ్రామ శివారు వాగులోని చెక్ డ్యాం పరిసర ప్రాంతంలో అక్రమంగా ఇసుక రవాణా తరలిస్తున్న ట్రాక్టర్‌ను స్థానిక ఎస్సై ఊర సృజన్ కుమార్ శనివారం రాత్రి పట్టుకుని సీజ్ చేశారు. ఈ విషయమై ఎస్సై మాట్లాడుతూ మండల కేంద్రంలోని దాదాసాహెబ్ కాలనీకి చెందిన పలువురు ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న సమచారం మేరకు ఎండీ ఖాసింకు చెందిన ట్రాక్టర్‌గా గుర్తించి అతనిపై కేసు నమోదు చేశామన్నారు.

13 నుంచి మండల స్థాయి క్రికెట్, ముగ్గుల పోటీలు

జఫర్‌గఢ్: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని మండల కేంద్రంలో ఈ నెల 13వ తేదీన మండల స్థాయి క్రికెట్, ముగ్గుల పోటీలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు బజ్జూరి మణికాంత్ తెలిపారు. మండల కేంద్రంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. క్రీడలు, ముగ్గుల పోటీల్లో యువతీయువకులను ప్రోత్సహించేందుకు బజ్జూరి ఆశోక్ స్మారకార్థం మండల స్థాయి పోటీలను నిర్వహించనున్నట్లు చెప్పారు. ముగ్గుల పోటీలు స్థానిక సెంటర్‌లో ఏర్పాటు చేశామన్నారు. ముగ్గుల పోటీల్లో మొదటి బహుమతి 3,016, ద్వితీయ 2,016, తృతీయ బహుమతి 1,016 నగదు అందజేయనున్నట్లు తెలిపారు. వీటితో పాటు క్రికెట్ పోటీల్లో విజేతలకు మొదటి బహుమతి రూ.15,116, రెండో బహుమతి రూ.10,116 అందించనున్నట్లు పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు తమ టీమ్‌ల వివరాలను 9618475112 సెల్ నంబర్‌కు తెలియజేయాలని ఆయన కోరారు.

విద్యార్థుల విహార యాత్ర



చిల్పూరు: చిన్నపెండ్యాల ప్రభుత్వ పాఠశాల పదో తరగతి విద్యార్థులు ఉమ్మడి జిల్లాలోని పర్యాటక ప్రాంతాలను చూసేందుకు విహార యాత్రకు శుక్రవారం తరలివెళ్లారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం గుడిమల్ల సంపత్‌కుమార్ మాట్లాడుతూ చదువుతోపాటు విజ్ఞాన విహార యాత్రలు కూడా విద్యార్థులకు ఎంతో అవసరమని అన్నారు. పీడీ లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు రవీందర్‌ప్రసాద్, భవాని, అరుణ, సంగీత, రమేష్, తాళ్లపల్లి పారిజాత తదితరులు ఉన్నారు.

న్యాయం చేయాలి



జనగామ రూరల్: తమ వ్యవసాయ భూమిలోకి వెళ్లేదారిని వెంచర్ యజమాని ఆక్రమిస్తే ప్రశ్నించినందుకు తమపై అక్రమ కేసులు పెట్టి ఇబ్బందులకు గురిచేస్తున్నారని, విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని బాధితులు రామబ్రహ్మచారి, రాజేశ్వరి కోరారు. ఈ మేరకు వారు డీసీపీ రాజమహేంద్రనాయక్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు.

ఆర్థికసాయం



కొడకండ్ల: కొడకండ్ల లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మండలకేంద్రానికి చెందిన భాధిత కుటుంబాలకు శనివారం ఆర్థిక సాయం అందించారు. ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన హోంగార్డు గులాం గౌస్‌పాషా కుటుంబానికి రూ. 25 వేలు, మహేష్ కుటుంబానికి రూ. 15 వేల సాయాన్ని లయన్స్‌క్లబ్ ప్రతినిధులు అందజేశారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు దామెర రవిందర్, కార్యదర్శి గాజుల రాములు, కోశాధికారి నేతి కొండయ్య, వెంకటనారాయణ, రమేష్, నవీన్, కుమార్, రాజు, రవిందర్, ఆసీఫ్, సోమయ్య, ప్రసన్న, శంషోద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

చేనేతలకు..

బచ్చన్నపేట: మండల కేంద్రంలో మార్కండేయ జయంతిని పురస్కరించుకుని చేనేతలకు కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జంగిటి విద్యానాథ్ రూ. 5వేల సాయం అందించారు. శనివారం పద్మశాలీలను కలిసి తన వంతు సహకారాన్ని అందజేసినట్లు తెలిపారు.

జిల్లా కన్వీనర్‌గా యాకయ్యగౌడ్



పాలకుర్తి టౌన్: తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక జిల్లా కన్వీనర్‌గా మండలంలోని చెన్నూరు గ్రామానికి చెందిన మొలుగూరి యాకయ్య గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఉద్యమకారుల ఐక్యవేదిక సమావేశంలో ఐక్యవేదిక జిల్లా కో కన్వీనర్ మండలంలోని ముత్తారానికి చెందిన నలమాస రమేశ్ గౌడ్, పాలకుర్తి నియోజవర్గ కన్వీనర్‌గా సిరిసన్నగూడేనికి చెందిన సంగి వెంకన్న, కోకన్వీనర్‌గా విస్నూరుకు చెందిన మాటూరి యాకయ్య, నియోజవర్గ కోఆర్డినేటర్‌గా చెన్నూరుకు చెందిన నారగోని ఎల్లయ్యగౌడ్, మండల అధ్యక్షుడిగా అనుముల అంజీరావు, ఉపాధ్యక్షుడిగా మామిండ్ల సోమయ్య, సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడిగా కారుపోతుల సోమయ్య, మండల అధ్యక్షుడిగా బల్గుల సోమనర్సయ్య, కార్యదర్శిగా గుగ్గిళ్ళ ఎల్లయ్య, కారుపోతుల శ్రీనివాస్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కన్వీనర్ మొలుగూరి యాకయ్య మాట్లాడతూ తెలంగాణ సాధనలో ఉద్యమకారుల పోరాటం మరువలేనిదన్నారు. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా ఉద్యమకారులను గుర్తించి రూ.25వేల పెన్షన్, 250 గజాల ఇంటి స్థలంతోపాటు ప్రతి ఉద్యమ కారుడికి ఇల్లు నిర్మించి ఇవ్వాలని కోరారు.

చేయూత



రఘునాథపల్లి: మండల కేంద్రానికి చెందిన గీత కార్మికుడు మల్కపురం మహేందర్‌గౌడ్ (42) తాటి చెట్టుపై నుంచి కిందపడి మృతి చెందగా గోపా ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి రూ.25 వేల సాయం అందజేసి దాతృత్వం చాటింది. శనివారం గోపా జిల్లా అధ్యక్షుడు మేకలపోతుల ఆంజనేయులుగౌడ్ జిల్లా, మండల గోపా ప్రతినిధులతో రఘునాథపల్లికి చేరుకుని మృతుడి చిత్ర పటానికి పూల మాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. రోదిస్తున్న బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ సందర్భంగా మృతుడి కుటుంబ సభ్యులకు రూ.25 వేల సాయం అందించారు. కార్యక్రమంలో గోపా మండల అధ్యక్షుడు రవిగౌడ్, మండల ప్రధాన కార్యదర్శి గైని శ్రీనివాస్‌గౌడ్, కోశాధికారి ముప్పిడి శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎంపీపీ వై కుమార్‌గౌడ్, మాజీ వైస్ ఎంపీపీ మల్కపురం లక్ష్మయ్యగౌడ్, నామాల బుచ్చయ్య గౌడ్ తదితరులు ఉన్నారు.

ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం



జనగామ రూరల్: సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న చేనేత సంఘం నాయకులు



తరిగొప్పుల: సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న పద్మశాలి నాయకులు

జనగామ రూరల్/తరిగొప్పుల/బచ్చన్నపేట/రఘునాథపల్లి/దేవరుప్పుల: చేనేత అభయహస్తం పథకానికి ప్రభుత్వం రూ.168 కోట్లు కేటాయించడాన్ని హర్షిస్తూ జిల్లా వ్యాప్తంగా చేనేత, పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటాలకు శనివారం క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సబ్బండ వర్గాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషిచేస్తుందని అన్నారు. ఆయా కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు సామల పరమేశ్వర్, రాష్ట్ర కార్యదర్శి దుడికి శ్రీలత, పట్టణ అధ్యక్షుడు బొంతపల్లి నాగరాజు, ప్రధాన కార్యదర్శి బిర్రు సత్యనారాయణ, పద్మశాలీ సంఘం నాయకులు, రాపోలు రామ్మూర్తి, మచ్చ నిత్యానందం, రచ్చ కృష్ణమూర్తి, మార్గం ఉప్పలయ్య, వగలబోయిన యాదగిరి, మార్కండేయ, సిద్దేశ్వర, వేముల బాలరాజు, గుండు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా ఆలేటి ఎల్లవ్వ జాతర పనులు

పాలకుర్తి: ఆలేటి ఎల్లవ్వ జాతరను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ తెలిపారు. శనివారం జాతర పనులను ఆయన నాయకులు, అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ ఝాన్సీ రాజేందర్‌రెడ్డి చొరవతో జాతరకు అవసరమైన సింగిల్ ఫేస్ ట్రాన్స్‌ఫారం మంజూరు కాగా బిగించడం జరిగిందన్నారు. ఎస్సై దూలం పవన్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి, మాజీ ఎంపీపీ కారుపోతుల శ్రీనివాస్, బత్తిని సురేష్, మాజి సర్పంచ్ జలగం కుమారస్వామి, మార్కెట్ డైరక్టర్ బానోత్ రమేష్, నాయకులు తదితరులు పాల్గొన్నారు. కాగా, జాతర కోసం నిర్వహించిన వేలంలో కొబ్బరి కాయల విక్రయానికి రూ.70,500, వాహనాల పార్కింగ్‌కు రూ.18,500, దుకాణాల ఏర్పాటుకు రూ.12,500, మద్యం అమ్మకానికి రూ.10లక్షలు, పులిహోరకు రూ.4వేలు వచ్చాయని నిర్వాహకులు తెలిపారు.



ట్రాన్స్‌ఫారం బిగిస్తున్న విద్యుత్ అధికారులు



జాతర ఏర్పాట్లను పరిశీలిస్తున్న నాయకులు

దాడి చేసిన నలుగురిపై కేసు నమోదు

రఘునాథపల్లి: మండలంలోని జాఫర్‌గూడెంలో భూ వివాదంలో దాడి చేసిన నలుగురిపై కేసు నమోదు చేసినట్లు రఘునాథపల్లి ఎస్సై దూదిమెట్ల నరేశ్ తెలిపారు. గ్రామానికి చెందిన అనుముల మల్లయ్య తన 0–17 గుంటల భూమిని అదే గ్రామానికి చెందిన కర్నె అశోక్‌కు మూడేళ్ల క్రితం విక్రయించాడు. ఇందుకు అశోక్ రూ.6 లక్షలు మల్లయ్యకు అప్పగించగా మరో రూ 3.77 లక్షలు బకాయి ఉంది. మిగతా డబ్బులు రిజిస్ట్రేషన్ చేశాకే ఇస్తానని అశోక్ అగ్రిమెంట్ చేసుకుని భూమి స్వాధీనం చేసుకున్నాడు. మల్లయ్య రిజిస్ట్రేషన్ చేయకపోగా తన భూమి తనకే ఇవ్వాలని అశోక్‌తో పలుమార్లు గొడవకు దిగాడు. శుక్రవారం అశోక్ ఆ భూమి దున్నిస్తుండగా మల్లయ్య, అతని కుమారుడు అనుముల రాజు, సోదరులు నర్సయ్య, రాములుతో కలిసి అశోక్‌పై దాడి చేశారు. అంతే కాకుండా అడ్డువచ్చిన ట్రాక్టర్ డ్రైవర్ చింత భాస్కర్, కూలీ పనికి వచ్చిన దేవరాయ పోచయ్యలపై సైతం దాడి చేసి గాయపర్చారు. దీంతో అశోక్ భార్య కర్నె సుగుణ ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఘనంగా వడ్డే ఓబన్న జయంతి

రఘునాథపల్లి: మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద శనివారం వడ్డే ఓబన్న జయంతిని వడ్డెర కుల సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఓబన్న ఫ్లెక్సీకి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఓబన్న స్ఫూర్తిగా వడ్డెరలమంతా ఐక్యతగా ముందుకు సాగుదామని ప్రసంగించారు. అల్లెపు రాములు, శివరాత్రి కొమురయ్య, గండికోట యాదగిరి, శివరాత్రి రాజు, సమ్మయ్య, పల్లపు మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఓబన్న వీరగాథను తెలుసుకోవాలి

చిల్పూరు: వడ్డె ఓబన్న వీరగాథను ప్రతిఒక్కరూ తెలుసుకోవాలని వడ్డెర సంఘం జిల్లా వైస్ ప్రెసిడెంట్ శివరాత్రి సమ్మయ్య అన్నారు. మండలంలోని మల్కాపూర్ గ్రామంలో శనివారం వడ్డెర సంఘం ఆధ్వర్యంలో ఓబన్న ఫ్లెక్సీకి గ్రామ నాయకుడు ఎడవెల్లి కృష్ణారెడ్డి నివాళులర్పించారు. అనంతరం ఓబన్న పోరాటాలు మరువలేనివని ఆయన సేవలను కొనియాడారు. సమ్మయ్య, పోలేపల్లి రంజిత్‌రెడ్డి, పోరెడ్డి బుచ్చిరెడ్డి, వెన్నం మాధవరెడ్డి, కొమ్మురాజుల కృష్ణ, మల్లయ్య, రాజయ్య, శివరాత్రి రవి పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న నాయకులు

గౌడ కులస్తుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇవ్వాలి

గోపా జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్

రఘునాథపల్లి: గౌడ కులస్తుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని గోపా జిల్లా అధ్యక్షుడు మేకలపోతుల ఆంజనేయులుగౌడ్ అన్నారు. మండలకేంద్రంలోని ఏఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో శనివారం గోపాసభ్యులు, గౌడ సంఘం పెద్దలతో కలిసి ఆయన గోపా నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించారు. అనంతరం గోపా మండల అధ్యక్షుడు రవిగౌడ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆంజనేయులుగౌడ్ మాట్లాడారు. ఎన్నికల సమయంలో గౌడ కులస్తులకు ఇచ్చిన హామీలు ప్రభుత్వం అమలు చేయాలన్నారు. సమావేశంలో గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎంపీపీ వై కుమార్‌గౌడ్, మల్కపురం లక్ష్మయ్యగౌడ్, నామాల బుచ్చయ్యగౌడ్, గైని శ్రీనివాస్‌గౌడ్, ముప్పిడి శ్రీనివాస్‌గౌడ్, కుర్ర సురేందర్‌గౌడ్ ,కోళ్ల రవిగౌడ్, బైరగోని శ్రీనివాస్‌గౌడ్, రాజబోస్ పాల్గొన్నారు.



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న గోపా సభ్యులు